క్లుప్తంగా

ట్రాన్స్‌కో ఏఈగా బాధ్యతలు


రామమోహన్

కోవెలకుంట్ల: ట్రాన్స్‌కో మండల ఇన్‌చార్జ్ ఏఈగా రామమోహన్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇది వరకు ఇక్కడ ఏఈగా పనిచేసిన అనంతరావు ఇటీవల నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాల జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న రామమోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆయన విధుల్లో చేరారు.

'ప్రకృతి' ఉత్పత్తులతో ఆరోగ్యం


ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన ఆకుకూరల ఉపయోగాలను వివరిస్తున్న వైద్యురాలు

బేతంచెర్ల: ఆరోగ్యకరమైన జీవన విధానం కోసం ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను ఆహారంగా తీసుకోవాలని వైద్యురాలు తస్లీమా అన్నారు. సోమవారం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పూజలందుకున్న యాగంటి ఉమామహేశ్వరుడు

బనగానపల్లె రూరల్: సంపూర్ణ చంద్ర గ్రహణం ముగిసిన తరువాత మండలంలోని పలు దేవాలయాలు సోమవారం ఉదయం శుద్ధి పూజల అనంతరం భక్తులకు తిరిగి దర్శనార్థం తెరుచుకున్నాయి. ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమా మహేశ్వర స్వామివారి ఆలయంలో ఉదయం 7.30 గంటలకు అర్చకులు సంప్రోక్షణ పూజలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. అలాగే నందవరం చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలోనూ శుద్ధి అనంతరం భక్తులకు దర్శనాలు అనుమతించారు. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా పల్లకీ సేవ

మండలంలోని యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకీపై కొలువు దీర్చి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పూజారి మృతి


రాంప్రసాద్(ఫైల్)

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని షిర్డీసాయి బాబా ఆలయ పూజారి రాంప్రసాద్(50) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆలయంలో దశాబ్ద కాలం పాటు ప్రధాన పూజారిగా సేవలు అందించిన ఆయన ఇటీవల అనివార్య కారణాలతో వైదొలిగారు. వారం క్రితం అనారోగ్యం బారిన పడడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందారు. షిర్డీ సాయి సేవా ట్రస్ట్ చైర్మన్ వీడీ రాజగోపాల్ పూజారి సంతాపం వ్యక్తం చేశారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

డోన్ టౌన్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరామ్, మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, కో–కన్వీనర్లు నాగమద్దయ్య, రామాంజనేయులు నేతృత్వంలో నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్ రవాణా రంగ కార్మికులకు హామీ ఇచ్చిన ×వాహన మిత్ర€ కింద రూ.25 వేల సాయం, కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజాకు వినతి పత్రం అందజేశారు. లారీ, ఆటో యూనియన్ నాయకులు తిరుపాలు, నరసింహ, సీతరాముడు, మద్దయ్య, మహేష్, బాలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రిలో కూర్చునేందుకు స్థలం లేక మెట్లపై కూర్చున్న రోగులు


రక్త పరీక్షల కేంద్రం వద్ద రోగులు, చిన్నారులు


వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు

వణికిస్తున్న విషజ్వరాలు

- ప్రతి గ్రామంలోనూ జ్వర బాధితులే
- బనగానపల్లెలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిట
- బేతంచెర్ల సీహెచ్‌సీలో అమాంతం పెరిగిన రద్దీ
- 350–400 నుంచి 800కు పెరిగిన ఓపీలు



ఓపీ కోసం వచ్చిన వారితో కిక్కిరిసిన బనగానపల్లె వంద పడకల ఏరియా ఆస్పత్రి, బేతంచెర్ల శేషారెడ్డి సీహెచ్‌సీలో ఓపీ వద్ద బారులు తీరిన రోగులు

బనగానపల్లె: మండలంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎక్కడ చూసినా జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి బాధితులే కనిపిస్తున్నారు. దీంతో నియోజకవర్గ కేంద్రమైన బనగానపల్లె వంద పడకల ఏరియా ఆస్పత్రి, టంగుటూరు, పలుకూరు పీహెచ్‌సీలు, ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరబాధితులతో నిండిపోతున్నాయి. రెండు నెలలుగా వర్షకాలపు వాతావరణ మార్పుల కారణంగా గ్రామాల వారీగా కుటుంబాలు మొత్తం జ్వరాల బారిన పడుతున్నారు. సాధారణంగా రోజుకు 350 వరకు ఉన్న ఏరియా ఆస్పత్రి ఓపీ కౌంటర్ ఇటీవల 450కి చేరిందని వైద్యులు తెలిపారు. ఓపీ టోకెన్ కోసం ఆధార్ నమోదు తప్పనిసరి చేయడంతో రోగులు ఎక్కువసేపు వేచి చూడాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఆస్పత్రిలోపల చికిత్స పొందేందుకు సగటున 2 నుంచి 3 గంటల సమయం పడుతోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని రోగులు కోరుతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల ఇష్టారాజ్యం

ఇక ప్రైవేట్ ఆస్పత్రులు మాత్రం దీనిని లాభాల వనరుగా మలుచుకుంటున్నాయి. సాధారణ జ్వరానికే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పేర్లతో ల్యాబ్ టెస్టులు వేయిస్తూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెలైన్ బాటిల్స్ పేరుతో అదనపు ఖర్చు పెట్టిస్తున్నారని రోగులు చెబుతున్నారు. దీంతో మధ్యతరగతి, దిగువస్థాయి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోగులతో బేతంచెర్ల సీహెచ్‌సీ కిటకిట

బేతంచెర్ల: వర్షాకాల వాతావరణ మార్పుల కారణంగా పట్టణ ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు విషజ్వరాలు, అలర్జీలతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బేతంచెర్ల పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీ రోగులతో కిటకిటలాడుతోంది. మునుపు రోజుకు సగటున 400 మంది వరకు రోగులు వచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 800 దాకా పెరిగిందని వైద్యులు తెలిపారు. సోమవారం ఆస్పత్రి ఓపీ, వార్డులు, ల్యాబ్‌ల వద్ద రక్తపరీక్షల కోసం చిన్నారులు, పెద్దలు బారులు తీరారు. గంటల తరబడి ఎదురుచూసి వైద్యం చేసుకుని వెళ్లారు.

70 శాతం మందికి వైరల్ ఫీవర్

వర్షకాలం నేపథ్యంలో రెండు నెలలుగా వైరల్ జ్వరాలు పెరిగాయి. గతంలో 350 ఓపీ ఉండగా ఇప్పుడు 400–450కి చేరింది. రోగుల్లో 70 శాతం వైరల్ ఫీవర్ బాధితులే. మందుల కొరత లేదు, అవసరమైన వైద్య సౌకర్యం అందిస్తున్నాం. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా కాచిన నీటినే తాగాలి.

–శిరీష, ఆర్ఎంఓ, ఏరియా ఆస్పత్రి, బనగానపల్లె

కాచి వడగట్టిన నీటినే తాగాలి



ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పెద్దలు, పిల్లల్లో జ్వరం, దగ్గు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. తప్పనిసరిగా కాచి వడగట్టిన నీటినే తాగాలి. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి. బయట ఆహార పదార్థాలను తినకుండా ఇంటి వద్ద తయారు చేసుకున్న ఆహారాన్నే తీసుకోవాలి. జ్వరం, దగ్గు ఉంటే వెంటనే ఆస్పత్రికి వచ్చి వైద్యసేవలు పొందాలి.

–విజయభాస్కర్, వైద్యుడు, బేతంచెర్ల

విష జ్వరాలపై అప్రమత్తత అవసరం


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల ప్రబలుతున్న విష జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ అశోక్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎల్ఎం కాంపౌండ్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 83 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో తొమ్మిది మందికి మలేరియా రాపిడ్ పరీక్షలు చేయగా ఎవరికీ మలేరియా లక్షణాలు కనిపించలేదు. వైరల్ జ్వరాలు కావడంతో మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో నీరు నిల్వ చేరడంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, తదితర విష జ్వరాలు సోకే అస్కారం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సంజీవ కర్ణ, ఎంపీహెచ్ఏలు మైమూన్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యతో పేదరికం దూరం


మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల: విద్యతో పేదరికాన్ని దూరం చేయవచ్చని..బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని కోవెలకుంట్ల వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన విద్య కార్యక్రమం ద్వారా ఎంతోమంది నిరక్షరాస్య వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ప్రస్తుత ఆధునిక కాలంలో డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యపై సరైన అవగాహన లేక తల్లిదండ్రులు పిల్లలను బడులకు పంపడం లేదన్నారు. విద్యార్థులు చదువు ప్రాముఖ్యతను తెలియజేసి చైతన్య పరచాలన్నారు. డిజిటల్ లైబ్రరీలను వినియోగించుకుని విద్యా, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవాలని పేర్కొన్నారు. అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, చంద్రమోహన్, సంటిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, కృష్ణశశాంక, లక్ష్మీదేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రణ భేరిని జయప్రదం చేద్దాం

డోన్ టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో రణభేరికి సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ ఉద్యమాన్ని ప్రారంభించాల్సి వచ్చిందన్నారు. ఈ నెల 25న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులను కోరారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు ఎస్ఎస్ బాబు, లక్ష్మీనాయక్, గోపాల్, ప్రసాద్‌రెడ్డి, లతీఫ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వార్డెన్ నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణం బలి


హాస్టల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి నాయకులు

డోన్ టౌన్: ప్రభుత్వ బాలుర బీసీ కళాశాల వసతి గృహంలో ఇంటర్ విద్యార్థి శ్యాంసుందర్ మృతి ఘటనపై హాస్టల్ వార్డెన్ మేరీ సూర్యకుమారి నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి ఐక్య సంఘం నేతలు ఆరోపించారు. సోమవారం మృత వార్త తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు వసతి గృహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. వార్డెన్ కర్నూలులోనే నివాసముంటూ హాస్టల్‌కు రాకుండా, విద్యార్థుల సమస్యలపై కనీస శ్రద్ధ చూపడంలేదని మండిపడ్డారు. వసతి గృహంలో వంద మందికి పైగా విద్యార్థులు ఉండగా వారిని పర్యవేక్షించే అధికారులు, రాత్రివేళల్లో వాచ్‌మెన్ కూడా అందుబాటులో లేకపోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి మేరీ సూర్యకుమారిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నేతలు లక్ష్మణసాయి, శివన్న, విజయభాస్కర్, సీపీఐ నాయకుడు రామ్మోహన్, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఏజెన్సీ మార్పు


వంట ఏజెన్సీ నిర్వాహకులతో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ

సాక్షి ఎఫెక్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని కొమ్మూరు కొట్టాల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీని మార్పు చేశారు. 'ఖాళీ కడుపుతో చదువుకునేదెట్లా' అనే శీర్షికతో ఆదివారం సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంఈఓ సోమశేఖర్ గ్రామానికి వెళ్లి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయం మేరకు వంట ఏజెన్సీని మార్పు చేశారు. హెడ్ కుక్‌గా మసిపోగుల ఎల్లమ్మ, అసిస్టెంట్ కుక్‌గా ప్రభావతిని ఎంపిక చేశారు. పిల్లలందరినీ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు.

పందుల తరలింపునకు బ్రేక్


వాహనాన్ని అడ్డుకుంటున్న పందుల యజమానులు

డోన్: పట్టణంలో పందుల బెడద రోజురోజుకీ పెరుగుతోంది. వీధుల్లో స్వైర విహారం చేస్తున్న పందుల కారణంగా వాహన రాకపోకలకు ఆటంకం కలగడంతో పాటు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రజల ఫిర్యాదుల మేరకు సోమవారం మున్సిపల్ అధికారులు కడప, పులివెందుల నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించి పందులను పట్టి తరలించే ప్రయత్నం చేశారు. అయితే స్థానిక పందుల యజమానులు తీవ్రంగా ప్రతిఘటించారు. చిగురుమానుపేట, తారకరామనగర్, వైఎస్సార్ సర్కిల్, పాతపేట ప్రాంతాల్లో వాహనాలను అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పందులు తరలించేందుకు తగిన సమయం ఇవ్వాలని యజమానులు డిమాండ్ చేస్తూ రోడ్డుపై నిరసన తెలిపారు. అధికారులు చేసేదేమీ లేక నెలరోజుల గడువు ఇచ్చి పందుల తరలింపు చర్యలను తాత్కాలికంగా నిలిపివేశారు.

దివ్యాంగులకు పథకాలు అమలు చేయాలి

అవుకు(కొలిమిగుండ్ల): కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని జిల్లా దివ్యాంగుల సంఘం జేఏసీ అధ్యక్షుడు దేవరాజు డిమాండ్ చేశారు. సోమవారం అవుకు తహసీల్దార్‌ను కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. 85 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు రూ.15వేలు పింఛన్ ఇవ్వాలని, అంత్యోదయకార్డులు పంపిణీ చేసి 35 కేజీ బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి 15 చొప్పున త్రీవీలర్ మంజూరు చేయాలని కోరారు. దివ్యాంగుల సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సురేష్, గుర్రప్ప మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

ప్యాపిలి: వైద్య సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సుదర్శన్ బాబు, జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి అంకిరెడ్డి ఆదేశించారు. ప్యాపిలి పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమం రిపోర్టులు, ఇతర రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. అధికారులు సుజాత, నజీరీన, వైద్యాధికారి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక చిన్నారి మృతి

బేతంచెర్ల: వేడి సాంబారు పాత్రలో పడి తీవ్రంగా గాయపడిన చిన్నారి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. వివరాలు.. బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో గత నెల 28వ తేదీ వినాయక చవితి పండుగను పురస్కరించుకుని భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన చిన్నారి (3) ఆడుకుంటూ వెళ్లి సాంబారు పాత్రపై పడి గాయపడింది. పాపను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో మరణించింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: డోన్–బేతంచెర్ల జాతీయ రహదారి పనుల కారణంగా మంగళవారం మల్కాపురం 33 కేవీ ఫీడర్ లైన్ షిఫ్టింగ్ పనులతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర, రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. చిన్న మల్కాపురం, రంగాపురం, గూటుపల్లె సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ ఉండదన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 9 గంటల వరకు.. మళీసాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు సరఫరా చేస్తామని వివరించారు.

నేడు 'అన్నదాత పోరు'

బనగానపల్లె రూరల్/డోన్ టౌన్: రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలు, గిట్టుబాటు ధరల సమస్యల పరిష్కారానికి డోన్ ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ×అన్నదాత పోరు€ కార్యక్రమం జరగనుంది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉదయం 7 గంటలకు కాటసాని నివాసం వద్దకు చేరుకోవాలన్నారు. అనంతరం ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. అలాగే డోన్ పట్టణంలోనూ శాంతియుత ర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు మాజీ మంత్రి బుగ్గన స్వగృహం నుంచి రెవెన్యూ డివిజన్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి రైతుల సమస్యలపై నిరసన వ్యక్తం చేయనున్నారు. అన్నదాతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న యూరియా కష్టాలు


ఇల్లూరుకొత్తపేట ఆర్ఎస్‌కే వద్ద యూరియా టోకెన్ల కోసం రైతుల క్యూ

బనగానపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో యూరియా కొరత ఇప్పటికీ కొనసాగుతోంది. సోమవారం బనగానపల్లె, భానుముక్కల, ఇల్లూరు కొత్తపేట, గులాంనబీపేట, రాళ్లకొత్తూరు, కైప గ్రామాల్లో మొత్తం 2,200 బస్తాల యూరియా రైతులకు పంపిణీ చేశారు. అయితే పాసుపుస్తకంపై కేవలం రెండు బస్తాల చొప్పున ఇవ్వడంతో ఇది తగదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాలన్నీ ఎస్ఆర్‌బీసీ ఆయకట్టులో ఉండడంతో అధిక విస్తీర్ణంలో వరి, మొక్కజొన్న, మిరప సాగు జరుగుతోందని, ఈ పంటలకు యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. అవసరానికి తగినంతగా యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి


డోన్: డీటీకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు



బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

డోన్‌టౌన్: మండలంలో యూరియ కొరత సృష్టిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి మోటా రాముడు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో డీటీకు ఫిర్యాదు అందజేశారు. నాయకులు రామ్మోహన్, పులిశేఖర్, నాగరాజు, రజాక్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

- బనగానపల్లె రూరల్: రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, రైతులు దుకాణాల వద్ద గంటల తరబడి క్యూలలో నిలబడుతున్నారని సీపీఐ, రైతు సంఘం నేతలు ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో జిల్లా నాయకులు శివయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. యూరియా ధరలు నియంత్రించాలని, కొరత నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు.
- బేతంచెర్ల: యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.
- అవుకు (కొలిమిగుండ్ల): యూరియా కొరతతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి నాగాంజనేయులు తెలిపారు. తహసీల్దార్ మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసినా, యూరియా అందట్లేదని ఆరోపించారు. బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలు చెల్లించి కొనాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.
- ప్యాపిలి: రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఐ మండల కార్యదర్శి మహేశ్, పట్టణ కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికార పార్టీ నాయకులకు మాత్రమే యూరియా అందుతుండడం బాధాకరమన్నారు.


ప్రారంభానికి నోచుకోని నూతన పాఠశాల తరగతి గదులు


అద్దె ఇంట్లో తరగతులు నిర్వహిస్తున్న సీఆర్ఎంటీ

ముహూర్తమెన్నడో..?

- ప్రారంభానికి నోచుకోని నూతన పాఠశాల భవనం
- అద్దె ఇంట్లోనే తరగతుల నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

బనగానపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం వహిస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బనగానపల్లె మండలం హుస్సేనాపురం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల భవనం మూడేళ్ల క్రితం కూలిపోయింది. అప్పటి నుంచి గ్రామంలోని ఓ అద్దె భవనంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మన బడి – నాడు నేడు పథకం, టెన్ కాంపోనెంట్ కింద రూ.38 లక్షల నిధులతో 2023లో కొత్త భవన నిర్మాణాన్ని ప్రారంభించింది. అయితే దాదాపు ఐదు నెలల క్రితమే నిర్మాణం పూర్తయినా, ఇప్పటికీ ప్రారంభం కాలేదు. నూతన భవనం అందుబాటులోకి రాకపోవడంతో పాఠశాలలో కొత్త విద్యార్థుల చేరికలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కేవలం 17 మంది విద్యార్థులే ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు బదిలీపై వెళ్లగా, మరొకరు ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేశారు. దీంతో తరగతులు క్లస్టర్ మొబలైజ్ టీచర్స్ (సీఆర్ఎంటీ) ఆధ్వర్యంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. పాఠశాలలో శాశ్వత ఉపాధ్యాయులు లేకపోవడం, వసతుల లోపం కారణంగా ఎక్కువ మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని కొత్త పాఠశాలను ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈఓ స్వరూపనుసాక్షి మాట్లాడుతూ.. నూతన తరగతి గదుల నిర్మాణం పూర్తయిందని, ఉన్నతాధికారులకు నివేదించి త్వరలో ప్రారంభించే చర్యలు తీసుకుంటామని తెలిపారు.